క్లుప్తంగా

శివార్చనకు శివలింగాల తయారీ



కొయ్యలగూడెంలో శివలింగాలను తయారుచేసిన మహిళలు

కొయ్యలగూడెం: జ్యోతిర్లింగాల్లో ఒకటైన మహా పుణ్యక్షేత్రం కాశీలో నిర్వహించే కోటి శివ లింగార్చనలో భాగంగా కొయ్యలగూడెం తూర్పు పేట రామాలయం వద్ద మహిళా భక్తులు శివలింగాల తయారీని ప్రారంభించారు. గతనెల 30న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ప్రారంభించగా ఈనెల 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బెల్లాని శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలు బంక మట్టితో శివలింగాలను తయారు చేస్తున్నారు. కాశీ పుణ్యక్షేత్రంలోని గంగా నది తీరంలో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు కోటిలింగాలకు నిత్యాభిషేకం నిర్వహిస్తారని దీని నిమిత్తం ఇప్పటివరకు పదిహేను వేల శివలింగాలను తయారు చేసినట్లు మహిళా భక్తులు పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణజ్యోతి

చింతలపూడి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాలు ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ప్రతి బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ బూత్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాను దగ్గర పెట్టుకుని ప్రజలు తనిఖీలు చేసుకునే విధంగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. డిసెంబర్‌లో మరోసారి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అభ్యంతరాలపై పోలింగ్ బూత్‌లో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎలక్షన్ డీటీ పాల్గొన్నారు.

విజయవాడ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



విజయవాడ వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రఘుబాబు

చింతలపూడి: చింతలపూడి మండలం, గణిజర్ల సచివాలయం వలంటీర్ గొల్లమూడి రఘుబాబు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందజేశాడు. పింఛన్ లబ్ధిదారు జొన్నలగడ్డ ఫ్రాన్సిస్ విజయవాడ వైవీ రావు ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విజయవాడ ఆసుపత్రిలో ఉన్న ఫ్రాన్సిస్ పరిస్థితిని గుర్తించి శుక్రవారం రఘుబాబు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ బొల్లిన వెంకట్రావు, ఎంపీటీసీ జి రాంబాబు, సచివాలయం అధికారులు వలంటీర్‌ను అభినందించారు.

రాష్ట్ర విద్యా సాఫల్య సర్వే పరీక్షలు

కొయ్యలగూడెం: రాష్ట్ర విద్యా సాఫ్యల సర్వే పరీక్షలకు 1,150 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి జే సురేష్ బాబు శుక్రవారం పేర్కొన్నారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలను అనుసరించి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ వారి ద్వారా మండలంలోని పలు పాఠశాలలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 73 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ర్యాండమ్ పద్ధతిలో 31 పాఠశాలలను ఎంపిక చేసి అందులోని విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు రేపల్లెవాడలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

కొయ్యలగూడెం: ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమానికి మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ విభాగం శ్రేణులు హాజరుకావాలని కోరారు.

బాలుర గురుకుల పాఠశాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

- ఎమ్మెల్యే ఎలీజా చొరవతో భవనాలు పూర్తి
- నేడు ప్రారంభించనున్న మంత్రి మేరుగ నాగార్జున



చింతలపూడిలో నిర్మించిన బాలుర గురుకుల పాఠశాల భవనం



గురుకుల పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: చింతలపూడిలో నిర్మాణం పూర్తయిన సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ మంత్రి ఆళ్ళ నాని, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ భవనాల ప్రారంభోత్సవానికి హాజరవుతారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. నూతన భవనాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎలీజా పరిశీలించారు. 2011లో చింతలపూడిలో గురుకుల పాఠశాల మంజూరైంది. 2013 డిసెంబర్‌లో 5 ఎకరాల స్థలంలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ.10.12 కోట్ల వ్యయంతో గురుకుల పాఠశాల నిర్మాణం చేపట్టారు. విద్యార్థుల డార్మెటరీ, పాఠశాల భవనాలతో పాటు వంట గది, డైనింగ్ హాలు, స్టాఫ్ క్వార్టర్లు, ప్రిన్సిపాల్ క్వార్టర్ నిర్మాణం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి గురుకుల పాఠశాల భవనాలను పూర్తి చేయడానికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఎలీజా పలు మార్లు భవన నిర్మాణాలను పరిశీలించి పనులు పరుగులు పెట్టించారు. సుమారు 500 మందికి పైగా విద్యార్థులకు మేలు జరగనుంది. శనివారం భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

కుక్కునూరు: ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకంలో ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఉప్పేరు శాఖ మెనేజర్ దినేష్‌కుమార్ కోరారు. శుక్రవారం బంజరగూడెంలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా బ్యాంక్ మేనేజర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకంలో రూ.436 చెల్లించి బీమా రక్షణ పొందాలని సూచించారు. పీఎంఎస్‌బీవై పథకంలో రూ.20 చెల్లించడం ద్వారా ఖాతాదారులకు అందే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గోళ్ళ వెంకమ్మ అనే ఖాతాదారు చనిపోయిన తరువాత పీఎంజేజేబీవై ద్వారా బీమా రూ.2 లక్షల చెక్ నామినీ అయిన గోళ్ళ మునిష్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో తొండిపాక సర్పంచ్ గడ్డం రాజేశ్వరి ఎంపీటీసీ వంకా రమణ, బ్యాంక్ మిత్రలు తోకల కొండయ్య, రత్నకుమారి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత



టి.నరసాపురంలో మాట్లాడుతున్న పోలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వెజ్జు వెంకటేశ్వరరావు



టి.నరసాపురంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి? సభలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

టి.నరసాపురం: సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందితేనే తనకు ఓటు వేయాలని అడిగే దమ్ము, ధైర్యం ఉన్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని పోలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వెజ్జు వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి? మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం టి.నరసాపురంలో శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో అందించిన సంక్షేమ పథకాల వివరాలు, చేసిన అభివృద్ధి వివరాల ప్రదర్శనను సచివాలయాల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పాలన పూర్తి అవినీతి మయమని అన్నారు. నేడు అంతర్గత కలహాలు సృష్టించేందుకు టీడీపీ నాయకులు సిద్ధమవుతారని, వాటిని గ్రహించి పార్టీ శ్రేణులు అప్రమత్తతో మెలగాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పోలవరం నియోజకవర్గ బూత్ కన్వీనర్ వాసిరెడ్డి మధు, మండల అధ్యక్షుడు శ్రీనురాజు ప్రభుత్వ పథకాలను, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, దేవరపల్లి ముత్తయ్య, బండివారిగూడెం రాంబాబు, పామాయిల్ ఓఈఆర్ కమిటీ మెంబర్ తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, మండల రైతు అధ్యక్షుడు మక్కిన వెంకట గోపాలరావు, వైస్ ఎంపీపీ బుర్ల దివ్యభారతి, ఎంపీటీసీలు బండి సుబ్బారావు, నులకాని నరసింహారావు, నార్లపాటి వెంకట్రావు, అర్జా బాలయ్య, బొడ్డపాటి రాంబాబు, కర్రి రామ భాస్కరరెడ్డి, గాది రాజేంద్రప్రసాద్ రెడ్డి, సర్పంచ్‌లు జల్లా మూర్తి, జి.వెంకటేశ్వరరావు, దాకా రపు సూరిబాబు, కాల్నీడి రాంబాబు, వెలిది నాగబాబు, బొంతు అంజిబాబు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, ఉమ్మడి సాయితేజ, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

మత్స్యశాఖ సహకారంతో చేపల పెంపకం



బయ్యనగూడెం, కేతవరం మధ్య చెరువులో చేప పిల్లలను వేస్తున్న మత్స్యశాఖ అధికారులు

కొయ్యలగూడెం: మత్స్య శాఖ సహకారంతో చెరువులలో చేపల పెంపక పథకాన్ని శుక్రవారం ఆ శాఖ అధికారులు, కొయ్యలగూడెం మత్స్యకార సంఘ సభ్యులు ప్రారంభించారు. బయ్యనగూడెం, కేతవరం గ్రామాల సమీపంలోని పలు చెరువులలో నాలుగు యూనిట్లకి చెందిన 1.60లక్షల చేప పిల్లలను ఈ సందర్భంగా విడుదల చేశారు. దున్నపోతుల గట్టు చెరువు, వెంకటేశ్వర చెరువు, దేవుళ్ళ చెరువులో చేపల పెంపకాన్ని నిర్వహిస్తున్నట్లు కొయ్యలగూడెం మత్స్యకార కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పాండ్రంకి శ్రీనివాస్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో సుమారు రూ.8 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫిష్ ఆంధ్రా భవనం పూర్తయ్యిందని దీనిని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా వచ్చేవారం ప్రారంభిస్తున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీ నరసయ్య, ఎఫ్‌డీవో మంగారావు వీఎఫ్ఏ రజినీప్రియ, కొయ్యలగూడెం జంగారెడ్డిగూడెం మండల పరిషత్తు వైస్ ప్రెసిడెంట్లు తుమ్మలపల్లి గంగరాజు, సరళ బుజ్జిబాబు, సంఘ సభ్యులు, నవిరి నారాయణ, పువ్వల సరి రాంబాబు పాల్గొన్నారు.

8న టి.నరసాపురంలో 'గడపగడపకు'



టి.నరసాపురంలో 200వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: నియోజకవర్గంలోని టి.నరసాపురం మండలం నుంచే ఎన్నికల శంఖారావం పూరిస్తున్నామని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. టి.నరసాపురంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు దాటిన సందర్భంగా డోర్ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 రోజులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న బొర్రంపాలెం అడ్డరోడ్డు నుంచి టి.నరసాపురం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, అనంతరం టి.నరసాపురంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ వాసిరెడ్డి మధు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనురాజు, దాసరి రాంబాబు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, వంటిపల్లి వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, వెలిది నాగబాబు, బొంతు అంజిబాబు, దేవరపల్లి ముత్తయ్య, మక్కిన వెంకట గోపాలరావు పాల్గొన్నారు.

'ఏపీకి జగన్ ఎందుకు కావాలి'పై ఇంటింటా ప్రచారం



జీలుగుమిల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలుపై ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చెయ్యాలని పోలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు విజ్జి వెంకటేశ్వరరావు అన్నారు. జీలుగుమిల్లిలో ఏపీకి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం అమలుపై శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి జగన్ ఎందుకు కావాలి అంటూ ప్రతీ ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ఎన్నుకోవడం వల్ల రాష్ట్ర అభివృద్ధితోపాటు అన్ని వర్గాల ప్రజలకు, కుటుంబాలకు మేలు జరుగుతుందని చెప్పారు.

పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు అల్లూరి రత్నాజీరావు, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోశమ్మ, వైస్ ఎంపీపీలు సోమగాని శ్రీనివాస్, ఉప్పల లలితకుమారి, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాసరెడ్డి, జేఏసీ మండల కన్వీనర్ వనమా రామకృష్ణ, నాయకులు చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, బి. ప్రేమ్‌కుమార్, సిర్రి జగదాంబ, సున్నం వరలక్ష్మి, కుంజా పార్వతి, మొడియం వెంకటలక్ష్మి, పైదా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ నెల 8న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తవుతున్న సందర్భంగా టి. నర్సాపురం మండలంలో భారీ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు పార్టీ పరిశీలకులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విడుదల చేశారు.

కార్తీక వన సమారాధన కరపత్రం ఆవిష్కరణ



జంగారెడ్డిగూడెంలో బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏలూరు రోడ్డులోని షిర్డీసాయి బాబా స్తూపం దగ్గరలో పర్వతం తులసీరావు మామిడితోటలో బ్రాహ్మణ కార్తీక వనసమారాధన డిసెంబర్ 3న నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ గౌరవ అధ్యక్షుడు మల్లాది సీతారామారావు తెలిపారు. శుక్రవారం పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అధ్యక్షుడు చిలుకూరి సాయి బాబు మాట్లాడుతూ అదేరోజు రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలను కార్యదర్శి కూచిబొట్ల రాము పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచిలక్ష్మి, కూచి త్రినాథరావు, మీడియా సలహాదారు లంకా నాగకుమార్, చిలుకూరి. లక్ష్మీనారాయణ, వేమూరి శ్యామలరావు, జూలూరి రాఘవరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలి



సుప్రీంపేట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దశ్యం

చింతలపూడి: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నగర పంచాయితీ కమిషనర్ ఎస్ రాంబాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సుప్రీంపేట సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, నాయకులు ఎ సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ వై కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ తనిఖీ



విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం దామోదరం సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. నోటు పుస్తకాలను తనిఖీ చేసి విద్యా సంబంధిత విషయాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. కళాశాలలో నిర్వహిస్తున్న నాడు–నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీఆర్‌సీ పరీక్షలు



విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబూరావు

బుట్టాయగూడెం: రాష్ట్ర విద్యాసాఫల్య సర్వే (ఎన్‌సీఆర్‌టీ) ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాల పరిశీలన, విద్యారంగంలో తీసుకోవాల్సిన మార్పులపై సర్వే ద్వారా వివరాలను సేకరించినట్లు ఎంఈఓ టి. బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని 27 పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు తెలుగు, గణితం సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి బోధించే ఉపాధ్యాయుల నుంచి, పాఠశాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయుల ద్వారా వివరాలను సర్వే చేసి తెలుసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 సీహెచ్ నరేంద్రరాయ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళపై దాడి చేసిన నేరంపై వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగిశెట్టిగూడెంకు చెందిన 15మంది గ్రూపుగా ఏర్పడి జంగారెడ్డిగూడెంలోని ఫిన్‌కేర్ బ్యాంకులో లోన్ తీసుకున్నారు. ఆ గ్రూపునకు నులకాని రాధ లీడర్‌గా వ్యవహరిస్తోంది. ఈ నెల 1వ తేదీ బుధవారం బ్యాంకు లోన్ కట్టాల్సి ఉన్నందున, గ్రూపు సభ్యురాలైన నల్లగోపుల కనకదుర్గను రాధ డబ్బులు అడిగింది. తాను పనికి వెళ్లానని సాయంత్రం వచ్చిన తరువాత ఇస్తానని కనకదుర్గ చెప్పడంతో రాధ అదే రోజు సాయంత్రం కనదుర్గ ఇంటికి వెళ్లి డబ్బులు తీసుకుంది. రాధ అక్కడి నుంచి వస్తుండగా, దారి మధ్యలో కనకదుర్గ భర్త వెంకటేశ్వరరావు అడ్డగించి, రాధను దూషిస్తూ, చేతులతో కొట్టి కిందపడేశాడు. ఈ ఘటనలో రాధకు గాయాలయ్యాయి. రాధ ఫిర్యాదు చేయడంతో వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నూకాలమ్మ ఆలయానికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ వారు శుక్రవారం విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. నిత్య పూజా కైంకర్యాలు, సాయం సంధ్యా హారతి పూజలు, వేద దర్బారుసేవ, చతుర్వేద స్వస్తి తదితర పూజలు అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు 25 కేజీల వెండితో అమ్మవారికి రజత వస్త్రం తయారు చేయించేందుకు సంకల్పించామన్నారు. శుక్రవారం మరడాని మహేష్ వరలక్ష్మి దంపతులు 9తులాల వెండిని, ఒక అజ్ఞాత భక్తుడు 6 తులాల వెండి గొలుసు, కొల్లూరి సుధీర్ బాబు దంపతులు 5 తులాల వెండిని, పోలుపర్తి శ్రీను, కుమారి దంపతులు 5 తులాల వెండిని విరాళంగా ఇచ్చారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, శ్రీనూకాంబిక సేవ బృందం సభ్యులు, ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు పాల్గొన్నారు.

స్థల వివాదంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళకు సంబంధించిన స్థలంలో పనులను అడ్డగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన పులపర్తి వీర వెంకట జయలక్ష్మి నాగమణికి జంగారెడ్డిగూడెం మారుతీనగర్‌లో 623 చ.గజాల స్థలం ఉంది. సదరు స్థలానికి సంబంధించి స్థానిక తహసీల్దార్ సరిహద్దులు చూపించడంతో, ఆ స్థలాన్ని శుక్రవారం శుభ్రపరిచేందుకు జేసీబీతో చేరుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఎస్‌కే దస్తగిరి, మరికొందరు కలిసి జేసీబీని, నాగమణిని స్థలంలోకి రానీయకుండా అడ్డుకున్నారన్నారు. దీంతో తనను స్థలంలోకి వెళ్లనీయకుండా దౌర్జన్యం చేస్తున్నారని దస్తగిరిపై నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం శ్రీ చక్ర సహిత ముత్యాలమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మ కుమారి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు మిత్తిపాటి విశ్వనాథ శ్రీనివాస్‌శర్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, అనంతేశ్వర స్వామికి పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పితానికి సూర్యప్రకాష్‌రావు, యర్రా నాగేశ్వరావు సత్య దంపతులు, ఏడుకొండల స్వామి, చోడవరపు రంగరావు జ్యోతి దంపతులు, దువ్వ రామకృష్ణ దంపతులు దర్శించుకున్నారు.

తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల

బుట్టాయగూడెం: ఐటీడీఏ కేఆర్‌పురం పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ తాత్కాలిక సీనియారిటీ జాబితాను సహాయ గిరిజన సంక్షేమాధికారి కార్యాలయ నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ జాబితాను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామని అన్నారు. గిరిజన ఉపాధ్యాయ సంఘ నాయకులు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 7వ తేదీలోపు తెలియజేయాలని అన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది సీనియారిటీ జాబితాను ప్రకటిస్తామని అన్నారు. వాటి ఆధారంగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.